సాక్షి జోగులాంబ గద్వాల

శనివారం। 15। మార్చి। 2025



వైభవంగా కల్యాణం

మన్యంకొండ అలివేలు మంగతాయారు కల్యాణం వైభవంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-33 (శనివారం సాయంత్రం)

సహర్ 5-04 (ఆదివారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 40.1 /18.8

ఉదయం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కనులపండువగా ఆదిశిలావాసుడి కల్యాణం



మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని **స్వయంభూ** శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శుక్రవారం వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి, శశాంక్ స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మహాహోమం నిర్వహించి స్వామివారి ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, ధీరేంద్రదాసు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గొంతు నొక్కుతున్నారు'



గద్వాల టౌన్: రాష్ట్ర శాసనసభలో ప్రజాస్వామ్య విలువలకు పాతరేస్తూ నిరాధార ఆరోపణలతో ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని సస్పెండ్ చేయడం దారుణమని బీఆర్ఎస్ నాయకుడు హన్మంతునాయుడు అన్నారు. జగదీష్‌రెడ్డి సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా శుక్రవారం అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేయడానికి యత్నించగా.. పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ అడ్డుకోగా.. కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం హన్మంతునాయుడు మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్ ఉంటే కాంట్రాక్టులు, కమీషన్లు, ఢిల్లీకి పంపుతున్న మూటల అంశాలు చర్చకు వస్తాయన్న భయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అనని మాటల్ని అన్నట్టుగా సృష్టించి.. జగదీష్‌రెడ్డిని కుట్రపూరితంగానే ప్రభుత్వం సస్పెండ్ చేయించిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బీచుపల్లి, మోనేష, శ్రీరాములు, రాజు, తిరుమలేష్, తిమ్మప్పగౌడ్, మునిమౌర్య, మక్బూల్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

లభ్యం కాని ఆచూకీ



- హైడ్రాలిక్ పవర్డ్ రోబోకు అనుసంధానంగా మరో యంత్రం
- 21వ రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలు
- మట్టి, రాళ్లను తొలగించగానే అడ్డువస్తున్న టీబీఎం శకలాలు
- అధికార యంత్రాంగం ముమ్మర ప్రయత్నాలు

వివరాలు 8లో ▸

- అచ్చంపేట/ మన్ననూర్

● అవగాహనే అస్త్రం

నాణ్యతపై గొంతు విప్పండి



- ప్రతి వస్తువు నాణ్యతను తెలుసుకోవాలి
- జిల్లాలో వినియోగదారుల హక్కుల కోసం ప్రత్యేక కోర్టు
- ఆశించిన స్థాయిలో ప్రచారం కల్పించని జిల్లా వినియోగదారుల కేంద్రం

నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

మనిషి సమగ్ర వికాసానికి న్యాయ పరిజ్ఞానం అవసరం అవుతుంది. సమాజంలో ప్రజలు ఉత్తమ వినియోగదారులుగా ఉండాలంటే చట్టాలను ఆయుధాలుగా ఉపయోగించుకోవాలి. మార్కెట్‌లో వ్యాపారులు చేసే మోసాలు గుర్తించి వాటిపై పోరాటం చేయడానికి ఉన్న అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి. లోపాలు ఉన్న వస్తువులు కొనుగోలు చేసిన సమయంలో వాటి వల్ల వినియోగదారుడు నష్టపోతే దానిని ప్రశ్నించడానికి ఉన్న చట్టాలు ఉపయోగించుకోవాలి. మనుషులు ఉపయోగించే ప్రతి వస్తువును పరీక్షించి నాణ్యత తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఎలాంటి వస్తువు అయినా సక్రమంగా లేకపోతే అలాంటి వస్తువు ఉత్పత్తి చేసిన కంపెనీపై పోరాటం చేసే అవకాశం వినియోగదారుడికి హక్కు ఉంది. శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- మహబూబ్‌నగర్ క్రైం /గద్వాల

ఐదేళ్లుగా వినియోగదారుల ఫోరం కోర్టులో కేసుల వివరాలు

సంవత్సరం	నమోదైన కేసులు	పరిష్కరించినవి	పెండింగ్ కేసులు
2020	85	84	1
2021	221	226	1
2022	96	90	6
2023	80	57	23
2024	101	29	72

మారిన చట్టం..



1986 వినియోగదారుల రక్షణ చట్టం స్థానంలో 2019 వినియోగదారుల కమిషన్‌గా మార్పు చేశారు. 1986 నాటి వినియోగదారుల రక్షణ చట్టంలో ఆన్‌లైన్‌లో లేని వస్తువులను లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా కొనుగోలు చేసిన వారికి హక్కులు వర్తించడం కోసం 2019 చట్టం పరిధిలో చేర్చారు. ఈ చట్ట ప్రకారం నాణ్యత లేని వస్తువులను ఉత్పత్తి చేసినందుకు, వాటిని విక్రయించడానికి ప్రకటనల్లో నటించే సెలబ్రిటీలకు సైతం రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల జరిమానా, రెండేళ్ల నుంచి పదేళ్ల కఠిన జైలు శిక్ష విధించే విధంగా రూపొందించారు. అలాగే ఆన్‌లైన్ ద్వారా విక్రయించే వస్తువులకు సంబంధించి పూర్తి వివరాలతో మార్కెట్‌లోకి విడుదల చేయాలి. నాణ్యత లేని వస్తువులు విక్రయిస్తే వస్తువులు ఉత్పత్తి చేసిన వారితో పాటు అమ్మిన వ్యక్తులపై కేసులు వేయడానికి చట్టంలో సవరణ తెచ్చారు.



ఇతని పేరు సురేష్‌బాబు, మహబూబ్‌నగర్‌లోని షాసాబ్‌గుట్ట ఏరియా శివాలయం వీధిలో ఉంటాడు. శేరీ ఫైనాన్స్ నుంచి టిప్పర్ కోసం రుణం తీసుకున్నాడు. కొంతకాలం తర్వాత పనులు నడవకపోవడంతో కిస్తీలు కట్టలేదు. దీంతో ఫైనాన్స్ వారు టిప్పర్‌ను సీజ్ చేశారు. కిస్తీలు కట్టలేనని ఒప్పుకొని వాహనానికి సంబంధించిన కాగితాలను ఫైనాన్స్ వారికి అప్పగించాడు. కొద్దిరోజుల తర్వాత సీజ్ చేసిన టిప్పర్‌ను ఫైనాన్స్ వారు ఇతరులకు అమ్మారు. అయినా వాహనానికి సంబంధించిన కాగితాలు కొనుగోలుదారులకు బదిలీ కాలేదు. ఆర్టీఏ మహబూబ్‌నగర్ కార్యాలయం నుంచి సంబంధిత టిప్పర్ ట్యాక్స్ డ్యూ ఉందని, చెల్లించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ ఇతడికి నోటీసులిచ్చారు. వాహనాన్ని సీజ్ చేసి ఇతరులకు ఫైనాన్స్ వారు అమ్మినట్లు తెలిపాడు. ఎక్కడైనా వాహనం ప్రమాదానికి గురైనా, ఇతరత్రా ఏమైనా జరిగినా మీది బాధ్యత అవుతుందని, రిజిస్ట్రేషన్ పత్రాలు మీ పేరుపైనే ఉన్నాయని ఆర్టీఏ కార్యాలయం అధికారులు తెలిపారు. ఫైనాన్స్ వారికి ఎన్నిసార్లు చెప్పినా స్పందించలేదు. మహబూబ్‌నగర్ వినియోగదారుల ఫోరంలో 2023 డిసెంబర్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును పరిశీలించిన వినియోగదారుల ఫోరం టిప్పర్‌ను కొనుగోలు చేసిన వారిపై వెంటనే రిజిస్ట్రేషన్ పత్రాలు బదిలీ చేయాలని, మానసికంగా ఇబ్బందులకు గురైనందున రూ.2 లక్షలు నష్టపరిహారం, రూ.2 వేలు కోర్టు ఖర్చులు బాధితుడికి చెల్లించాలని వినియోగదారుల ఫోరం జనవరి 22న తీర్పు ఇచ్చింది.

ఇదీ నేపథ్యం

వినియోగదారుల హక్కుల ఫోరం ఉమ్మడి జిల్లాలో 1988 అక్టోబర్‌లో ప్రారంభించారు. ప్రస్తుతం దీనికి ప్రత్యేక న్యాయమూర్తితో పాటు, ఒకరు సభ్యులు ఉన్నారు. పరిపాలన కోసం ప్రత్యేక విభాగంతో పాటు ఒక కోర్టు కూడా అందుబాటులో ఉంది. వచ్చిన వినియోగదారుల కేసుల నమోదు చేసుకోవడం కోసం ప్రత్యేక భవనం ఉంది.

⇨ జిల్లా వినియోగదారుల హక్కుల ఫోరంలో వినియోగదారులు ఒక్క రూపాయి నుంచి రూ.50 లక్షల వరకు కేసులు వేయడానికి అవకాశం ఉంది. దీంట్లో రూపాయి నుంచి రూ.5 లక్షల వరకు ఉన్న కేసులు కోర్టులో ఉచితంగా వాదిస్తారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు వరకు కోర్టు ఫీజు రూ.200, రూ.10 లక్షల నుంచి రూ.20లక్షల వరకు ఫీజు రూ.400 ఉంటుంది. రాష్ట్ర కమిషన్‌లో రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉంటే కోర్టు ఫీజు రూ.వెయ్యి, రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటే రూ.4వేలు ఉంటుంది. జాతీయ కమిషన్‌లో రూ.కోటికి పైగా ఉంటే ఫీజు రూ.5 వేలు ఉంటుంది.

⇨ వినియోగదారులఫోరం కోర్టులో ఎలాంటి కేసు వేయాలి, వాటి వివరాలు తెలుసుకోవడానికి స్థానికంగా ప్రత్యేక హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంది. ముఖ్యంగా వినియోగదారుడు ఎలాంటి న్యాయవాది లేకుండా కోర్టులో కేసు వేయడానికి అవకాశం కల్పించారు.

⇨ ఏదైనా ఒక వస్తువులు కొనుగోలు చేసిన తర్వాత ఆ వస్తువు నాసిరకంగా ఉండటం లేదా మరమ్మతుకు గురైతే అప్పుడు సెక్షన్ 35 ప్రకారం వినియోగదారుల ఫోరం కోర్టులో ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన 30 రోజుల వ్యవధిలో సదరు వ్యక్తి లేదా సంస్థకు నోటీస్ ఇవ్వగా 45 రోజుల వ్యవధిలో దీనికి సమాధానం చెప్పాలి. లేకపోతే కోర్టు ఎక్స్‌పార్టీ చేసి ఆర్డర్ వన్‌సైడ్ చేసి కోర్టు తీర్పు ఇస్తుంది. ఇచ్చిన జడ్జిమెంట్‌పై ప్రతివాది 45 రోజుల్లో నష్ట పరిహారం చెల్లించాలి.. లేకపోతే అప్పీల్ వేసుకోవాలి.



వినియోగదారుల ఫోరం కోర్టు

ఎలాంటి కేసులు వేయడానికి అవకాశం ఉంది

వినియోగదారులు ఎయిర్‌లైన్స్, మెడికల్, రైల్వే, బ్యాంకులు, ఇన్సూరెన్స్, టెలికాం, పోస్టల్, విద్యుత్, రియల్ ఎస్టేట్, ఇళ్ల నిర్మాణం, రవాణా, చిట్‌ఫండ్స్, వ్యవసాయం, కస్టమర్ గూడ్స్, కొరియర్ సర్వీస్, విద్యారంగం, నాన్ బ్యాకింగ్ ఫైనాన్షియల్ సంస్థల వల్ల నష్టపోతే కేసులు వేయడానికి అవకాశం ఉంది.

ఎలక్ట్రానిక్ తూకాల్లో మోసాలు



గద్వాలలో చాలా వరకు వ్యాపార దుకాణాల్లో ఎలక్ట్రానిక్ తూకాలు ఏర్పాటు చేసినా వాటిలో కూడా మోసాలు జరుగుతున్నాయి. ఎలక్ట్రానిక్ తూకాలను ముందస్తుగానే 15- 20 గ్రాముల వరకు ఎక్కువ ఉండేలా సర్దుబాటు చేసి తూకాలలో మోసాలకు పాల్పడుతున్నారు. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

- హన్సేన్, గద్వాల

బంగారం షాపుల్లో..



గద్వాల పట్టణం పెద్ద వ్యాపార కేంద్రం. ఇక్కడ ముఖ్యంగా బంగారు వ్యాపారం పెద్దఎత్తున జరుగుతుంది. చాలా వరకు బంగారు షాపులలో ఎలక్ట్రానిక్ తూకాలు వినియోగిస్తున్నా 10 గ్రాముల బంగారంపై కనీసం 0.5- 1 గ్రాముల వరకు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కరోజు కూడా ఈ షాపులలో సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించలేదు.

- రమేష్, గద్వాల

వినియోగదారుల్లో చైతన్యం రావాలి

జిల్లాలో ప్రతిరోజు హక్కుల ఫోరానికి రెండు నుంచి మూడు వరకు కేసులు వస్తుంటాయి. ఎక్కువగా ఎలక్ట్రానిక్ వస్తువులు, జీవిత బీమా, చిట్‌ఫండ్, ఫైనాన్స్‌లో నష్టపోయిన వాళ్లు అధికంగా వస్తుంటారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ఎవరూ రావడం లేదు. పట్టణ ప్రాంతాల నుంచి అవగాహన ఉన్న వ్యక్తులు మాత్రమే కేసులు వేయడానికి వస్తున్నారు. ఇంకా ప్రజల్లో దీనిపై చైతన్యం రావాల్సిన అవసరం ఉంది. వచ్చిన కేసులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషి చేస్తున్నాం. జిల్లాలో వినియోగదారులు ఎలాంటి కేసులు వేయడానికి అవగాహన లేకుంటే 08542-245633 నంబర్‌కు ఫోన్ చేయాలి.

- సృజన్‌కుమార్, వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సూపరింటెండెంట్

ప్రాథమిక స్థాయిలో.. కృత్రిమ మేధ



3, 4, 5 తరగతుల విద్యార్థులకు 'ఏఐ' బోధన

- నేటినుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 66 స్కూళ్లలో నిర్వహణ
- గత నెల 25నే నారాయణపేటలో ప్రారంభం
- సత్ఫలితాలు ఇవ్వడంతో అన్నిచోట్ల అమలుకు చర్యలు
- కంప్యూటర్ ల్యాబ్‌లు ఇతర పరికరాల ఏర్పాటు

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
మహబూబ్‌నగర్	10	300
నారాయణపేట	10	300
జోగులాంబ గద్వాల	22	660
నాగర్‌కర్నూల్	13	390
వనపర్తి	11	330

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బోధన గత కొన్నేళ్లుగా ఉపాధ్యాయుల ద్వారా సాగుతుండగా.. విద్యార్థి అక్షర పరిజ్ఞానం, అభ్యాసన సామర్థ్యాలను అంచనా వేసి.. వాటిని మదింపు చేయడం అనుకున్నంత మెరుగ్గా జరగడం లేదు. ఈ కారణంగా చాలా మంది విద్యార్థులు చదువులో వెనకబడిపోతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. దీంతో విద్యార్థి విద్యా సామర్థ్యాలను మదింపు చేసేందుకు ప్రభుత్వం కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈకే స్టెప్ అనే సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురాబోతోంది.

మరో 56 పాఠశాలల్లో..

ప్రస్తుతం టెక్నాలజీ పరంగా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఎంతో కీలకంగా మారింది. దీని సేవలను పాఠశాలలో వినియోగించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మొదట పైలెట్ ప్రాజెక్టు కింద నారాయణపేటలో 10 పాఠశాలల్లో గత నెల 25న ప్రారంభించారు. అక్కడ సత్ఫలితాలు ఇవ్వడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన మరో 56 పాఠశాలల్లో శుక్రవారం నుంచి అమలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ప్రైమరీ స్కూల్స్ ఇందుకోసం ఎంపిక చేశారు. హైస్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తే ప్రైమరీ స్కూల్ విద్యార్థులు కూడా వినియోగించేందుకు వీలుగా రూపొందించారు. ప్రతి జిల్లాలో నలుగురు రీసోర్సుపర్సన్లకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. వారు ఆయా జిల్లాల్లోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి పాఠశాలల్లో అమలు చేయనున్నారు. ఇందులో ప్రధానంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో ల్యాబ్‌ల ఏర్పాటుకు దాదాపు అన్ని పాఠశాలల్లో కంప్యూటర్లు వచ్చినా ఇందులో టేబుళ్లు, కుర్చీలు, హెడ్‌ఫోన్స్, ఇంటర్నెట్ వంటివి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని తెలుస్తుంది.

సామర్థ్యాల మదింపు..

ఎంపిక చేసిన పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల్లో చదువుతున్న విద్యార్థులకు వెనకబడి ఉండే విద్యార్థులను గుర్తించి కంప్యూటర్ ముందు కూర్చోబెడతారు. ఇందులో ప్రధానంగా ఇంగ్లిష్, తెలుగు, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో విద్యార్థి అభ్యాసనా సామర్థ్యాలను పరిశీలించాల్సి ఉంది. ముందుగా విద్యార్థికి కేటాయించిన పెన్ నంబర్ (పర్మనెంటర్ ఎడ్యుకేషన్ నంబర్) ద్వారా ఇందులో లాగిన్ కావాల్సి ఉంటుంది. ఈ నంబర్ ఎంటర్ చేసిన ప్రతిసారి విద్యార్థి గత కొన్ని రోజులుగా చేస్తున్న పర్ఫామెన్స్, డెవలప్‌మెంట్, నేర్చుకున్న అంశాలు ఇందులో నిక్షిప్తమవుతాయి.

విజయవంతం చేస్తాం..



తక్కువ సామర్థ్యాలు ఉన్న విద్యార్థులను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం ఏఐ ల్యాబ్ అందుబాటులోకి తెచ్చింది. ఇందులో ఇంగ్లిష్, తెలుగు, మ్యాథ్స్‌పై ఏఐ ద్వారా సామర్థ్యాలను పెంచేందుకు వీలుంది. వారి సామర్థ్యం ఎంతో కంప్యూటర్ ఒక అంచనా రిపోర్టు ఇస్తుంది. దాని ఆధారంగా విద్యార్థిని మరింత మెరుగుపర్చే విధంగా చర్యలు ఉంటాయి. పైలెట్ ప్రాజెక్టు కింద శనివారం 10 పాఠశాలల్లో ప్రారంభిస్తున్నాం. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తాం.

- ప్రవీణ్‌కుమార్, డీఈఓ, మహబూబ్‌నగర్

సులభంగా ఉంది..



ఉపాధ్యాయులు పుస్తకాలతో ప్రతిరోజు పాఠ్యాంశాల బోధన చేస్తుంటారు. కానీ, ఇటీవల మా పాఠశాలలో కంప్యూటర్ ద్వారా చదువు చెబుతున్నారు. దీంతో పుస్తకాల్లోని అంశాలు చాలా సులభంగా అర్థమవుతున్నాయి. చదవాలనే ఉత్సాహం మరింత పెరిగింది.

- మీనాక్షి, 5వ తరగతి, నారాయణపేట

అర్థం అవుతున్నాయి..



మా తరగతిలో విద్యార్థులు చాలా వరకు పాఠశాలకు గైర్హాజరు అయ్యేవారు. పాఠాలు అర్థం కాక హోంవర్క్ చేసుకుని రాకపోతే టీచర్లు కొడతారని దుమ్మా కొట్టేవారు. విద్యార్థుల స్థాయిని బట్టి కంప్యూటర్‌లో బోధన వేగంగా, నిదానంగా జరుగుతుండటంతో అన్ని విషయాలు బాగా అర్థం అవుతున్నాయి.

- భార్గవ్, 5వ తరగతి, నారాయణపేట

ఈ విధానం బాగుంది..



కంప్యూటర్ ద్వారా బోధన ప్రారంభించిన తర్వాత తెలుగు, ఆంగ్లంలో పదాలను అర్థం చేసుకుని బాగా పలుకుతున్నాం. గణితంలోనూ కూడికలు, తీసివేతలు తదితర వాటిని చక్కగా చేయగలుగుతున్నాం. మొదట్లో టీచర్లు ఎంత చెప్పినా నెత్తికి ఎక్కేది కాదు. ప్రస్తుత విధానం బాగుంది.

- విజయలక్ష్మి, 4వ తరగతి, కొల్లంపల్లి, నారాయణపేట



తెలకపల్లి మండలం ఆలేరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు

ఆస్తిపన్నుపై వడ్డీ భారమే..

- ఈసారి వెసులుబాటు లేనట్లే
- వందశాతం వసూలు చేయాలని ఆదేశాలు

గద్వాల టౌన్: మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను బకాయిదారులకు ఈసారి వడ్డీ మినహాయింపు ఇవ్వకూడదనే ప్రభుత్వ నిర్ణయంగా ఉంది. ఆస్తిపన్ను వడ్డీతో సహా మొత్తం వసూలు చేయాలని ఆదేశాలు ఇస్తున్న ఉన్నతాధికారులు వడ్డీ మాఫీ విషయాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో మున్సిపల్ ఉద్యోగులు ఆస్తిపన్నును వడ్డీతో కలిపి వసూలు చేస్తున్నారు. ఇది పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారనుంది. దీనికి తోడు పన్ను మొండి బకాయిదారులపై ఇప్పటికే వడ్డీ రెట్టింపు అయ్యింది. ఈ పరిస్థితుల్లో పూర్తిస్థాయి పన్నుల వసూళ్లు, చెల్లింపులు ఇబ్బందికరంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆస్తిపన్ను వసూలు గురించి ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ ఈ నెలాఖరు వరకైనా ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తుందని బకాయిదారులు ఎదురుచూస్తున్నారు. ఈ వైఖరితో ఈసారి అన్ని మున్సిపాలిటీలు ఆస్తిపన్ను వందశాతం వసూలు చేస్తాయా.. లేదా.. అనేది సందిగ్ధంగా మారింది. ఒకవైపు ఉన్నతాధికారుల ఆదేశాలు.. మరోవైపు వడ్డీతో కలిపి పన్నులు వసూలు చేయడం మున్సిపల్ సిబ్బందికి ఇబ్బందికరంగానే తయారైంది. మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లపై ప్రభుత్వం కొంతకాలంగా వడ్డీ మినహాయింపు వెసులుబాటు కల్పిస్తోంది. ప్రతి మార్చిలో ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు విడుదల చేసి ఈ అవకాశాన్ని ఇస్తోంది. ఆస్తిపన్ను బకాయిదారులకు వడ్డీ మినహాయింపు కొంత ఊరటనిచ్చేది. ఆస్తిపన్ను బకాయిదారులపై మున్సిపల్ అధికారులు రెండు శాతం వడ్డీ విధిస్తారు. ఏడాది పొడవునా వివిధ కారణాలతో చెల్లించని ఆస్తిపన్ను బకాయిదారులకు వడ్డీ మినహాయింపుతో కొంత తగ్గడంతోపాటు మున్సిపాలిటీలకు సైతం ఆస్తిపన్ను పూర్తిస్థాయిలో వసూలయ్యేది. కానీ, ఈ ఏడాది ప్రభుత్వం ఆస్తిపన్నుపై వడ్డీ మినహాయింపు ఇవ్వకపోవడంతో వందశాతం వసూలుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మార్గదర్శకాలు జారీ..

మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లు మందకొడిగా సాగుతున్న నేపథ్యంలో వంద శాతం చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత మున్సిపల్ అధికారులు ఇటీవలే ఆదేశాలు జారీ చేశారు. ఆస్తిపన్నుతోపాటు లైసెన్స్, నీటి పన్ను, ప్రచార పన్నుల వసూళ్లను వేగిరం చేసేందుకు మార్గదర్శకాలను కూడా సూచించారు. ఈ మేరకు జిల్లాలోని గద్వాల, అయిజ, అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీలకు ఆదేశాలు అందాయి.

⇨ మున్సిపాలిటీలోని వివిధ విభాగాల్లో పనిచేసే అధికారుల పర్యవేక్షణలో బిల్ కలెక్టర్, జూనియర్, సీనియర్ అసిస్టెంట్, వార్డు ఆఫీసర్లతో బృందాలను ఏర్పాటు చేయాలి.

⇨ ఒక్కో బృందానికి రోజువారి లక్ష్యాలను కేటాయించి.. వసూళ్ల తీరు సమీక్షించాలి.

⇨ మైకులు, కరపత్రాలతో బకాయి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ప్రచారం చేయాలి.

⇨ ఒక్కో బిల్ కలెక్టర్ పరిధిలో బకాయిలు పడిన 500 మంది జాబితాను తయారు చేసి వసూలుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

⇨ బకాయిల వసూళ్లలో బిల్లు కలెక్టర్ 85 శాతం, ప్రత్యేక బృందాలు 10 శాతం, కమిషనర్ 5 శాతం వసూలు చేయాల్సి ఉంటుంది.

⇨ ప్రభుత్వ సంస్థలు చెల్లించాల్సిన బకాయిలపై ఆయా కమిషనర్లు కలెక్టర్‌ను సంప్రదించి, వసూలయ్యేలా చర్యలు చేపట్టాలి.

⇨ గతేడాదితోపాటు అంతకు ముందు కరోనా కాలంలో ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీ మినహాయింపు ఇవ్వడంతో గద్వాలలో 90 శాతానికి పైగా ఆస్తి పన్ను వసూలైంది. వడ్డీ మినహాయింపుతో దాదాపు రూ.20 లక్షలకు పైగా బకాయిదారులకు మేలు జరిగింది. మున్సిపాలిటీకి కొంత నష్టమైనా ఆస్తిపన్ను వసూలై అభివృద్ధికి దోహదపడింది.



గద్వాల పట్టణ వ్యూ

ఈసారి ఉండకపోవచ్చు..



ఆస్తిపన్నుపై వడ్డీ మాఫీకి సంబంధించిన ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి రాలేదు. బకాయిలతోపాటు ఆస్తి పన్ను చెల్లించాలి. ఆ దిశగానే వసూళ్లు చేస్తున్నాం. వరుసగా రెండేళ్లపాటు పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. బకాయిలు చెల్లించిన వారికి పెద్ద మొత్తంలోనే రాయితీ వచ్చింది. ఈసారి వడ్డీమాఫీ ఉండకపోవచ్చు. ప్రతిఒక్కరూ పన్ను చెల్లించి మున్సిపాలిటీకి సహకరించాలి.

- దశరథ్, మున్సిపల్ కమిషనర్, గద్వాల

వైభవంగా అలివేలు మంగ కల్యాణం

- మంత్రోచ్ఛరణల నడుమ వేంకటేశ్వర, అలివేలు కల్యాణోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- అన్నదాన కార్యక్రమం



అలంకరణలో వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మ దేవతా మూర్తులు



పల్లకీలో ఉత్సవ మూర్తుల ఊరేగింపు



తాంబూలంలో అమ్మవారి తాళిబొట్టును భక్తులకు చూపిస్తున్న ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీఅలివేలు మంగతాయారు తిరుకల్యాణోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చిన వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన శేషవాహనంలో వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగతాయారు దేవతామూర్తులను ఉంచి దేవస్థానంలోని గర్భగుడి నుంచి పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాల మధ్య ఊరేగిస్తూ కల్యాణకట్ట వద్దకు తీసుకొచ్చారు. భక్తుల హరినామ స్మరణల మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది.

కన్నుల పండువలా తిరుకల్యాణోత్సవం ..

కల్యాణోత్సవం సందర్భంగా మామిడి తోరణాలు, వివిధ రకాల పూలు, శోభాయమానంగా అలంకరించిన కల్యాణకట్ట మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవంలో జీలకర్ర, బెల్లం తదితర పూజల అనంతరం శ్రీ అలివేలు మంగ మంగళసూత్రధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాల మధ్య జరిగిన ఈ పవిత్ర ఘట్టాన్ని చూసి భక్తులు భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. అనంతరం వేంకటేశ్వర స్వామి, అలివేలు మంగతాయారు దేవతామూర్తులకు పట్టు వస్త్రధారణ, తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ బంగారు, వెండి ఆభరణాలు, రకరకాల పూల మధ్య ఈ దేవతామూర్తుల దంపతులు దగదగ మెరిసిపోతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. భక్తులు ఈవేడుకలను కనులారా తిలకించి పునీతులయ్యారు. చాలా మంది దేవతామూర్తుల మీద వేసిన తలంబ్రాలను తీసుకెళ్లడానికి పోటీపడ్డారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు దేవస్థానం తరఫున వారి చేతులకు పసుపుకొమ్ములను ధరింపచేశారు. కల్యాణోత్సవం అనంతరం ఈ దేవతామూర్తులను శేషవాహనంలో మళ్లీ కల్యాణ కట్ట నుంచి గర్భగుడిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ ఉత్సవాలకు హాజరైన భక్తులు చాలా మంది దేవస్థానంలో కూడా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కొంత మంది భక్తులు దేవస్థానం ముందున్న ధ్వజస్తంభం వద్ద రూపాయి నాణేలను ఉంచి తమ అదృష్ట పరీక్షను చూసుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, పాలక మండలి సభ్యులు వెంకటాచారి, సురేందర్, గోవింద్, అలువేలమ్మ, సుధా, మంజుల పాల్గొన్నారు.

కనులపండువగా అశ్వవాహన సేవ

- హోమం నిర్వహించిన పండితులు
- స్వామివారి వెండి ముఖం, నాగపడగకు ప్రత్యేకపూజలు

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద స్వామివారి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. గురువారం అర్ధరాత్రి దాటాక స్వామివారికి అశ్వవాహనసేవ నిర్వహించారు. ఆలయం ముందున్న చిన్న తేరును పూజారులు శుద్ధిచేశారు. ఆలయంలో ఉన్న స్వామివారి ఉత్సవ విగ్రహాలను పూజారులు తీసుకొచ్చి చిన్నతేరుపై ఉన్న అశ్వవాహనంపై అలంకరించారు. అనంతరం తేరు ముందు పండితులు హోమం నిర్వహించారు. భక్తులంతా కలిసి ఆలయం ముందున్న తేరును జయజయధ్వానాల మధ్య కొద్ది దూరం ముందుకు తీసుకెళ్లి అశ్వవాహనసేవను ముగించారు. శుక్రవారం ఉదయం స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, బలిహరణ పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. గ్రామంలో ఉన్న స్వామి వారి వెండి ముఖం, నాగపడగలను రాత్రి పల్లికిలో ఉంచి గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. మేళతాళాల సవ్వడిలో వెండి ముఖాన్ని ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ప్రధాన ఆలయంలో శివలింగానికి స్వామి వారి వెండి ముఖం, నాగపడగను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత రథోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఈఓ రాజేశ్వరశర్మ, ఆలయ ఉద్యోగి అనంతసేన్‌శర్మ, అర్చకులు యాదగిరిశర్మ, తాళ్లపాక రామలింగశర్మ, శివశర్మ, మణికంఠశర్మ, రేవంత్‌శర్మ, వినయ్‌శర్మ, గ్రామస్తులు ఉన్నారు.



అశ్వవాహనంపై కొలువైన రామలింగేశ్వరస్వామి

ఆలయాభివృద్ధికి కృషి చేస్తా : ఎంపీ డీకే అరుణ

అడ్డాకుల: ప్రసిద్ధి చెందిన శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మండలంలోని కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద రూ.7లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాలును శుక్రవారం రాత్రి ఆమె ప్రారంభించి అందులో పూజలు చేశారు. అనంతరం ప్రధాన ఆలయంలోని శివలింగానికి అర్చకులు అభిషేకం, పూజలు చేయించారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు. రామలింగేశ్వరాలయం చరిత్ర చాలా గొప్పదని, ఇక్కడి భక్తులకు మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ నాయకులు తన దృష్టికి తేవడంతో నిధులు మంజూరు చేసినట్లు ఎంపీ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వస్తున్నందున కమ్యూనిటీ హాలును వినియోగించుకోవాలని సూచించారు. పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి, సీనియర్ నాయకుడు సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి అరవింద్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రమేష్, టీకే నర్సింహ్మా, నాయకులు గట్టు మల్లేష్ యాదవ్, కొండారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, ఈఓ రాజేశ్వరశర్మ ఉన్నారు.



కందూర్ దేవాలయం వద్ద కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

క్లుప్తంగా

పొలం పనిచేస్తూ కుప్పకూలి..

- గుండెపోటుతో యువ రైతు మృతి



మాణిక్యప్ప (ఫైల్)

దామరగిద్ద: పొలంలో పనిచేస్తూ కుప్పకూలి గుండెపోటుతో ఓ యువ రైతు మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలో వత్తుగుండ్లకి చెందిన కొత్తమాలే మాణిక్యప్ప(35) శుక్రవారం తన పొలంలో సాగుచేసిన కీరదీస పంటను కోసేందుకు పొలానికి వెళ్లాడు. పొలం పనుల్లో ఉండగా మధ్యాహ్నం ఒక్కసారిగా గుండెలో నొప్పి రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పొలంలోనే కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు మహేష్, గణేష్‌లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక నాయకులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మహమ్మదాబాద్: మొకర్లాబాద్ శివారులో అనుమానాస్పదస్పద స్థితిలో ఓ గుర్తు తెలియని మహిళ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.. వివరాలు.. మండలంలోని మొకర్లాబాద్ రెవెన్యూ శివారులో ముందలితండా అటవీ ప్రాంతంలో 8రోజుల క్రితం గుర్తుతెలియని వృద్ధ మహిళ (65) అక్కడికెళ్లి మరణించింది. శుక్రవారం విషయం పోలీసులకు తెలియడంతో వారు అక్కడికెళ్లి చూడగా మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నది. మహిళకు సంబంధించిన ఆనవాళ్లు తెలియలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహిళ వివరాలు తెల్పిన వాళ్లు మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

బిజినేపల్లి : మండలంలోని వెల్గొండకి చెందిన రమేష్ (38) అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం శాయిన్‌పల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. వెల్గొండకి చెందిన రమేష్ అతని స్నేహితుడు కలిసి బైక్‌పై బుద్దారం నుంచి బిజినేపల్లికి వస్తున్నారు. శాయిన్‌పల్లి గ్రామంలో ఎత్తైన స్పీడ్‌బ్రేకర్ వద్ద బైక్ అదుపుతప్పి రమేష్ ఎగిరి కిందపడి అక్కడికక్కడే మరణించాడు. అతని స్నేహితుడికి గాయాలు కాగా చికిత్స కోసం నాగర్‌కర్నూల్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. శాయిన్‌పల్లిలోని ఈ ఎత్తైన స్పీడ్ బ్రేకర్ ప్రజల పాలిట మృత్యువుగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గొంతులో అన్నం ముద్ద ఇరుక్కొని వృద్ధురాలి మృతి



శాంతమ్మ (ఫైల్)

మల్దకల్ : గొంతులో అన్నం ముద్ద ఇరుక్కొని శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన అమరవాయి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. అమరవాయికి చెందిన శాంతమ్మ(75) రోజు ఇంటి, కూలీ పనులు చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేది. శుక్రవారం హోలీ పండగ ఉండటంతో ఇంటి వద్ద ఉన్న ఆమె మధ్యాహ్నా భోజనం సమయంలో అన్నం ముద్ద గొంతుల్లో ఇరుక్కోవడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు వెంటనే108అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు.

లభ్యం కాని ఆచూకీ

- హైడ్రాలిక్ పవర్డ్ రోబోకు అనుసంధానంగా మరో యంత్రం
- 21 రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలు
- మట్టి, రాళ్లను తొలగించగానే అడ్డువస్తున్న టీబీఎం శకలాలు
- అధికార యంత్రాంగం ముమ్మర ప్రయత్నాలు



రోబోకు అనుసంధానంగా లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంపు మోటారు, ట్యాంకు

అచ్చంపేట/మన్ననూర్: శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ)సొరంగంలో చిక్కుకున్న వారి ఆచూకీ కోసం అధికార యంత్రాంగం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. 21వ రోజు కూడా ఏడుగురి అచూకీ లభ్యం కాలేదు. కాడవర్ డాగ్స్ చూపిన డీ1, డీ2 ప్రదేశాల్లో సహాయక బృందాలు త్వవకాలు చేపడుతున్నారు. 10 మీటర్ల పొడవునా 18 అడుగుల మేర పేరుకుపోయిన మట్టి, రాళ్లు, టీబీఎం మిషన్ విడిభాగాలు ఉండటంతో త్వవకాలకు ఆటంకం కలుగుతోంది. శక్తికి మంచి శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు కొద్దిగా మట్టి, రాళ్లను తొలగించగానే టీబీఎం శకలాలు అడ్డువస్తున్నాయి. ప్లాస్మా కట్టర్‌తో కట్ చేసిన తర్వాతే మళ్లీ త్వవకాలు చేపడుతుండటంతో పనులు ముందుకు సాగడం లేదని రెస్క్యూ సభ్యులు అంటున్నారు. సింగరేణి రెస్క్యూ జీఎం బైద్య సహాయక బృందాల వెంట ఉంటూ పనులు వేగంగా సాగేందుకు తోడుపాటు అందిస్తున్నారు. రోబో సమర్థవంతంగా పనిచేయడంలో సాంకేతిక సమస్యలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సొరంగం ప్రాంతంలో హైస్పీడ్ నెట్‌వర్క్ సౌకర్యం లేకపోవడంతో ఆఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. కార్మికుల ఆచూకీ లభ్యం కావడానికి మరో రెండు, మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. సొరంగం 14 కిలోమీటర్ సమీపంలో40 నుంచి 70 మీటర్ల వరకు అతి ప్రమాదస్థలంగా ఉంది. మొదటి రోజు నుంచి నేటి వరకు నీటి ఊట ఏమాత్రం తగ్గకుండా ప్రవహిస్తుండటంతో సహాయక చర్యలకు విఘాతం కలుగుతోంది. 13.5 కిలోమీటర్ తర్వాత ఊహకందని విధంగా కంకర సిమెంట్‌లా బిగించుకపోవడం మూలంగా బురద నీటిలో టీబీఎం మిషన్ శకలాలు తొలగించడానికి ఇబ్బందులు ఎదరవుతున్నాయి. డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, నాగర్‌కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ సహాయక బృందాల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సొరంగంలో పనులు సమర్థవంతంగా నిర్వహిచేందుకు అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోకు అనుసంధానంగా ప్రత్యేక యంత్రాలను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. యంత్రాలు మట్టిని త్వరగా తొలగించి బయటికి పంపుతుందన్నారు.

రోబోకు అనుబంధంగా వాక్యూమ్ పంపు, ట్యాంకు

సొరంగం కుప్పకూలిన అతి క్లిష్టమైన డీ-1, డీ-2 ప్రదేశంలో ఇప్పటి లోపలికి పంపిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోకు అనుసంధానంగా లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంపు మోటారు, ట్యాంక్ యంత్రాలను శుక్రవారం లోపలికి పంపించారు. సొరంగంలోని శిథిలాలు, మట్టి, బురద, రాళ్లను బయటికి తేవడంలో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో మాన్యువల్ పద్ధతిలో కాకుండా హైడ్రాలిక్ పవర్డ్ రోబోను వినియోగించి బురద, మట్టి, రాళ్లను బయటికి తెచ్చే ప్రయత్నాలు మొదలు పెట్టారు. అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానం కలిగిన ఈరోబో లోపల పెద్దఎత్తున పేరుకుపోయిన బురద, మట్టి, రాళ్లను సమర్థవంతంగా డ్రిల్లింగ్ చేస్తోంది. దీనికి అడ్డుగా వచ్చే పెద్దపెద్ద రాడ్లు మాత్రం గ్యాస్ కట్టర్స్‌తో కట్‌చేయాల్సి ఉంటుంది. రోబో తీసిన వర్థ్యాలను 30హెచ్‌పీ సామర్థ్యం గల లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంపు మోటరు వాక్యూమ్ ట్యాంకుకు పంపిస్తోంది. ఇదీ గంటకు 620 క్యూబిక్ మీటర్లు మట్టిని, ఇతర వ్యర్థాలను కన్వెయర్ బెల్టు ద్వారా బయటికి పంపించే సామర్థ్యం ఉంది. అధునాతన సాంకేతికత యంత్రాలను వినియోగించి సహాయక చర్యలు సమర్థవంతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ బాదవత్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈసహాయక చర్యల్లో సింగరేణి, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఆర్మీ, ర్యాట్ హోల్ మైనర్స్, హైడ్రా, అన్వి రోబోటిక్స్, దక్షిణ మధ్య రైల్వే, జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వంటి 12 బృందాలు నిరంతంరంగా పనిచేస్తున్నాయి.



సొరంగంలోకి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉంచిన గ్యాస్ సిలిండర్లు

అందుబాటులోకి రోబో సేవలు

ఎస్ఎల్‌బీసీ సొరంగం ఘటనలో రోబో సేవలు గురువారం రాత్రి నుంచి అందుబాటులోకి వచ్చాయి. పనులు వేగంగా జరుగుతున్నాయి. రెండు మూడు రోజుల్లో సహాయక చర్యల్లో మరికొంత పురోగతి సాధించే అవకాశాలు న్నాయి. ప్రస్తుతం 650మంది రెస్క్యూ బృంద సభ్యులు పని చేస్తున్నాయి. కేరళకు చెందిన కాడవర్ డాగ్స్, రేడార్ పరికరం గుర్తించిన డీ-1, డీ-2 ప్రదేశాల్లో తవ్వకాల్లో చేయడంతో ఒక మృతదేహం లభించింది. అవీ గుర్తించిన ప్రదేశాల్లో శుక్రవారం మొదటి షిఫ్టులో 148 మంది, రెండో షిఫ్టులో 38 మంది రెస్క్యూ టీం సభ్యులు టన్నెల్‌లోనికి వెళ్లారు. టన్నెల్‌లోకి వెళ్లిన రోబో సేవలు ఇప్పటివరకు ఉపయోగంలోకి రాకపోగా ప్రస్తుతం రోబోకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన ట్యాంకు ద్వారా కన్వేయర్ బెల్టు సహాయంతో బురద నీటిని బయటికి పంపడంతో పనుల్లో వేగం పెరిగే అవకాశముంది. రోబో సహాయంతో గంటకు 620క్యూబిక్ మీటర్ల మట్టి బయటకు వచ్చే క్రమంలో రోజుకు 6, 000 క్యూబిక్ మీటర్ల మట్టి పనులు జరుగుతాయి. టన్నెల్‌లో వస్తున్న సీపేజ్ వాటర్‌ను డీ వాటరింగ్ చేస్తున్నాం. ప్రస్తుతం డీవాటరింగ్ సమస్య లేదన్నారు. మరో రెండు మూడు రోజుల్లో మరికొందరి మృతదేహాలు లభించే అవకాశం ఉంది.

– బదావత్ సంతోష్, కలెక్టర్, నాగర్‌కర్నూలు జిల్లా

బైక్‌ను ఢీకొట్టిన కారు : ఇద్దరికి గాయాలు

అడ్డాకుల: ఓ బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టగా ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మూసాపేట మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. అడ్డాకుల మండల కేంద్రానికి వన్నం నాగరాజు యాదవ్, ఆంధ్రప్రదేశ్‌లోని ఆంధ్ర ప్రాంతానికి చెందిన వాసులు కొన్నాళ్ల నుంచి స్నేహ చికెన్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. ఈక్రమంలో ఇద్దరు కలిసి బైక్‌పై చక్రాపూర్ సమీపంలోని స్నేహ పరిశ్రమ నుంచి అడ్డాకులకు వెళ్తున్నారు. జానంపేట పీహెచ్‌సీ సమీపంలో హైవేపై హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపు వెళ్లే కారు బైక్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఇద్దరు కిందపడగా వన్నం నాగరాజు యాదవ్ కాలు విరిగిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో యువకుడు వాసు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అదే సమయంలో కారులో వస్తున్న ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి ప్రమాదాన్ని గుర్తించి క్షతగాత్రులను స్థానికుల సాయంతో అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇదిలాఉండగా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన నాగరాజు తల్లి కూడా అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సన్నిహితులు నాగరాజు వైద్య ఖర్చుల కోసం దాతలతో నగదును పోగు చేస్తున్నారు.

తుంగభద్ర నదిలో నీటి కుక్కలు



అలంపూర్: తుంగభద్ర నదిలో శిరకుక్కలు అందరిని ఆకట్టుకున్నాయి. స్థానిక నదుల్లో చేపలు, తాబేలు, నీటి పాములను చూసి ఉంటారు. కానీ అరుదైన నీటి కుక్కలను చూసిన స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. అలంపూర్ పట్టణంలోని తుందభద్ర నదీ తీరంలో వింత జలజీవులు కనువిందు చేశాయి. దాదాపు 10వరకు ఉన్న జల జీవులు నది ఒడ్డులో గుట్టపక్కన నీటిలో ఈదుతూ కనిపించాయి. కొద్దిసేపు నదిలో ఉన్న గుట్టపైకి వచ్చిన జీవులు ఆతర్వాత నదిలోకి వెళ్లాయి. స్థానిక మత్స్యకారులు వీటిని శిరకుక్కలు అని పిలుస్తారని తెలిపారు. ఈ జాతి జీవులు శ్రీశైలం డ్యాంలో ఎక్కువగా సంచరిస్తుంటాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కృష్ణా-తుంగభద్ర నదులు అడుగంటుతున్నాయి. నదిలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోవడంతో అక్కడి నుంచి ఈ ప్రాంతానికి ఈ జీవులు వచ్చి ఉంటాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. సాధారణంగా నదిలో పెద్దచేపలు, తాబేలు, నీటిపాములను చూసిన స్థానికులు వింతగా ఉన్న జీవులను కనిపించేసరికి వాటిని తమ ఫోన్లలో వీడియోలు, ఫోటోలు తీసి సంబరపడ్డారు.

జోగుళాంబ క్షేత్రంలో చండీహోమాలు



ఆలయంలో చండీ హోమాలు

అలంపూర్ : అలంపూర్ క్షేత్రంలో వెలిసిన శ్రీజోగుళాంబ అమ్మవారి ఐద శక్తిపీఠ ఆలయంలో శుక్రవారం చండీహోమాలు నిర్వహించారు. జోగుళాంబ అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం, పౌర్ణమి, అమావాస్యకు చండీహోమాలు నిర్వహిస్తారు. శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకొని చండీహోమాలు నిర్వహించారు. 117మంది భక్తులు ఈ హోమాల్లో పాల్గొన్నారు. పౌర్ణమి రోజు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై శ్రీబాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు బలవన్మరణం

- కుమారుడి కళ్లను దానం చేసిన తల్లి



బాల్‌రాజ్(ఫైల్)

నవాబుపేట: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన శుక్రవారం లింగంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు .. లింగంపల్లికి చెందిన బాల్‌రాజ్ (26) అనే యువకుడు శుక్రవారం తన బొలెరో గూడ్స్ వాహనాన్ని ఇంటి నుంచి తీసుకొని వ్యవసాయ పొలానికి వె ళ్లాడు. అక్కడే వాహనాన్ని నిలిపి వెనుకభాగంలో ఉన్న కొండికి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పా ల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే మరణించాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

నేత్రదానం

పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించిన అనంతరం మృతుడి తల్లి యాదమ్మ తన కుమారుడి కళ్లను దానం చేసేందుకు అంగీకరించింది. దీంతో ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది మృతుడు బాల్‌రాజ్ కళ్లను తీసుకొని కుటుంబ సభ్యులకు ధ్రువపత్రం అందించారు. నేత్రదానం చేసిన ఆకుటుంబాన్ని అందరూ అభినందించారు.

వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: భర్త, ఇతర కుటుంబసభ్యులు వేధించడంతో పాటు వెట్టిచాకిరి చేయించడంతో ఓ వివాహిత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ సీఐ అప్పయ్య తెలిపిన వివరాలు.. మహబూబ్‌నగర్‌లోని హబీబ్‌నగర్‌కు చెందిన యాస్మిన్‌బేగం(32) శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడింది. మూడు నెలల నుంచి భర్త, అత్తమామలు మానసికంగా వేధించడంతో పాటు ఇంట్లో పనులన్నీ ఆమెతో చేయిస్తుండటంతో తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. గతంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగితే కౌన్సిలింగ్ ఇచ్చినా భర్త ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో యాస్మిన్ బేగం ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గట్టు : మండలంలోని రాయాపురానికి చెందిన సరోజమ్మ(50) పాము కాటుకు గురై గద్వాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు. వివరాలు.. రాయాపురానికి చెందిన భార్యాభర్తలు సరోజమ్మ, హనుమంతు గురువారం వ్యవసాయ పొలానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికొచ్చే క్రమంలో వంట చెరుకు కోసం కట్టెలను మూట కట్టుకుంటున్న తరుణంలో సరోజమ్మను పాము కాటేసింది. విషయం తెలుసుకున్న భర్త హనుమంతు హుటాహుటిన సరోజమ్మను గట్టులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో అక్కడి నుంచి గద్వాలకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందగా భర్త హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిప్పంటుకొని గొర్రె పిల్లలు..

ఊట్కూరు: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గొర్రెపిల్లలు మృతి చెందిన సంఘటన ఊట్కూరు శివారులో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. బాధితుల తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గొర్రెల కాపర్లు అయ్యలప్ప, తిప్పన్న, కురువ బలరాం, చెన్నప్ప, కొండప్ప సుమారు 60 గొర్రె పిల్లలను గ్రామశివారులో ఓ రైతు పొలం దగ్గర ముళ్లతో కంచె ఏర్పాటుచేసి అందులో ఉంచారు. గొర్రెలను మేపడానికి వారంతా వెళ్లారు. మధ్యాహ్నం వేళ పొలాల గట్లకు నిప్పంటుకొని గొర్రెలు నిల్వఉన్న ప్రాంతానికి వ్యాపించింది. దీంతో సుమారు 50 గొర్రె పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి. నిప్పంటుకున్న విషయాన్ని తెలుసుకున్న గొర్రెల కాపరులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. మంటలు ఆర్పగా అప్పటికే 50 గొర్రెపిల్లలు మృతి చెందగా 10 గొర్రె పిల్లలు గాయాలతో మిగిలాయి. సుమారు రూ. 2లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. గొర్రెల కాపర్లను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు గ్రామస్తులు కోరారు.